

టీబీ వ్యాధి పట్ల జాగ్రత్త వహించాలి

టీటీపేట, మార్చి 22: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ శ్యామ్‌కుమార్ చేపట్టారు. టీబీ వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధికి తగిన పరీక్షలు, ఉచిత మందులు మొదలైన వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు హరిప్రసాద్, రాజేశ్వరి, సుధారాణి, అరుణ, లక్ష్మీ, ప్రధానోపాధ్యాయులు రాంచందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వడగండ్లకు విరిగిన పైరు



నేల వాలిన మొక్కజొన్న పంట



నేల వాలిన వరి పంట

నష్ట పరిహారం.. అందేనా?

కామారెడ్డి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలైన అకాల వడగండ్ల వర్షాలు, భారీ వర్షాలు ఈదురుగాలులకు ప్రతీ సీజన్‌లో రైతులు వేసిన పంటలకు నష్టం వాటిల్లుతున్నా వ్యవసాయశాఖ అధికారులు సర్వేలు చేయడం, నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపడం, రైతులను ఆదుకుంటామంటూ ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా బాధిత రైతులకు మాత్రం పరిహారం అందడం లేదు. ఫలితంగా రైతులు దెబ్బతిన్న పంటలతో తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలవుతున్నారు. ఇటీవల జిల్లాలో కురిసిన వడగండ్ల వర్షాలతో 20,071 ఎకరాలకు పైగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 14,553 మంది రైతులు నష్టపోయారు. గత ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తామంటూ చివరి వరకు ఇవ్వలేక పోయింది. కనీసం కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైన ఇచ్చిన హామీ మేరకు నష్టపోయిన రైతులకు ఎకరాన రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ వస్తుంది. వరి, మొక్కజొన్న, జొన్న పంటలకు ఇటీవల వడగండ్లతో తీవ్రంగా నష్టం వాటిల్లింది. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గ పరిధిలో పలు మండలాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలోనూ కురుస్తున్న వడగండ్ల వర్షాలు రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి.

నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి

● లక్ష్మీ, సంగమేశ్వర్, దోమకొండ

సంగమేశ్వర్ శివారులో ఉన్న రెండున్నర ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. పంట పొట్టదశలో ఉంది. ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాలు, ఈదురుగాలులకు పంట మొత్తం నేల కొరిగింది. వడ్ల రాశులు రాలిపోయాయి. సుమారు రూ.80 వేల వరకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

వడగండ్లతో 20వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

జిల్లాలో ఇటీవల వడగండ్ల వర్షాలతో 15 మండలాల పరిధిలోని 130 గ్రామాల్లో 14,553 మంది రైతులకు చెందిన 20,071 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగండ్లతో వరి ధాన్యం రాలిపోయి భూమి పాలై ంది. జొన్న సైతం దెబ్బతింది. మొక్కజొన్న కంకులు విరిగిపోయాయి. ఈదురుగాలులకు వందల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, జొన్న నేల కొరిగింది. గాంధారి, రాజంపేట, భిక్కనూర్, మాచారెడ్డి, నాగిరెడ్డిపేట, సదాశివనగర్, బీర్కూర్, బాన్సువాడ, దోమకొండ, నస్రూల్లాబాద్, తాడ్వాయిలల్లో ఈ మూడు పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. వరి 12,373 మంది రైతుల 16,298 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. 1,673 రైతులకు చెందిన 2,784 ఎకరాల్లో మొక్కజొన్న, 362 రైతులకు చెందిన 705 ఎకరాలలో జొన్న, 76 మంది రైతులకు చెందిన 192 ఎకరాల్లో మామిడి, 42 మంది రైతులకు చెందిన 45 ఎకరాల్లో కూరగాయలు, 9 మంది రైతులకు చెందిన 20 ఎకరాల్లో తంబాకు, 7 గురు రైతులకు చెందిన 10 ఎకరాల్లో బొప్పాయి, 8 మంది రైతులకు చెందిన 12 ఎకరాల్లో ఉల్లిగడ్డ, ముగ్గురు రైతులకు చెందిన 5 ఎకరాల్లో గోధుమ పంటలకు నష్టం వాటిల్లింది.

నాలుగేళ్లుగా అందని నష్టపరిహారం

రైతుల పంటలకు భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో ఫసల్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో దెబ్బతిన్న పంటలకు ఈ పథకం ద్వారా రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించేవారు. ఈ పథకంలో లోపాలున్నాయనే కారణంతో గత రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం నిలిపివేసింది. ప్రత్యామ్నాయంగా మరో పథకం ఏవి తీసుకురాలేదు. ప్రకృతి వైపరీత్యాలతో నాలుగేళ్లుగా నష్టపోతున్న రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. రైతులు ఏ కారణంతో చనిపోయిన రైతు బీమా అమలు చేస్తున్నా ప్రభుత్వం పంట నష్టపోతే ఆర్థిక భరోసా మాత్రం ఇవ్వలేదు. గత నాలుగేళ్లుగా ప్రకృతి వైపరీత్యాల వల్ల సుమారు 39వేల మంది రైతులకు సంబంధించి 21వేల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. 2020-21లో 1,874 మంది రైతులకు సంబంధించి 3,426 ఎకరాలు, 2021-22లో 1,035 మంది రైతులకు సంబంధించి 2,817 ఎకరాలు, 2022-23లో 10,430 మంది రైతులకు సంబంధించి 19,805 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

- ఇటీవల వడగండ్లతో జిల్లాలో 20,071 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- 14,553 మంది రైతులకు నష్టం
- ప్రతీయేట ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతింటున్న పంటలు
- పంట నష్టపోయి లబోదిబోమంటున్న అన్నదాతలు
- నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వానికి బాధిత రైతుల వేడుకోలు

సర్వేకే పరిమితం అయ్యేనా?

భారీ వర్షాలు, అకాల వర్షాలు, వడగండ్ల వానలు, అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతింటున్న రైతులకు మాత్రం నష్టపరిహారం అందడం లేదు. వడగండ్ల వానలు, భారీ వర్షాలు కురిసి పంట చేన్లలోనే రైతుల పంటలు దెబ్బతినడమే కాకుండా నీట మునిగి కొట్టుకుపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి సమయంలో సంబంధిత వ్యవసాయశాఖ క్షేత్రస్థాయిలో సర్వేలు చేసి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. పంట నష్టం సర్వేలతోనే అధికారులు సరి పెడుతున్నారు. ఈ నష్టం అంచనా కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయి. నాలుగేళ్లుగా పంట నష్ట పరిహారం ప్రభుత్వాలు అందించకపోవడంతో రైతులకు అప్పులే మిగులుతున్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నష్టపరిహారం అందేనా?

రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే ఇటీవల ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చే స్తా వ ని ప్రకటిం చింది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వడగండ్ల వర్షాలకు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బ తిన్నాయి. కామారెడ్డి జిల్లాలోనూ వడగండ్ల వర్షాలకు 20వేల ఎకరాలకు పైగానే పంటలకు నష్టం వాటిల్లింది. అయితే పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేచేసి ప్రభుత్వానికి నివేదించారు. అంతేకాకుండా మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీలు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులను పరామర్శించారు. నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎకరాన రూ.10వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. అయితే ఈ నష్టపరిహారం హామీకే పరిమితం కాకుండా వీలైనంత తొందరగా రైతులకు అందిస్తే ఆర్థిక భారం నుంచి రైతులు ఎంతో కొంత గట్టెక్కే పరిస్థితి ఉంటుంది.

అప్పు చేసి పంట సాగు చేశాను

● దేవరాజు, దోమకొండ

సంగమేశ్వర్ శివారులో 6 ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. బయట నుంచి అప్పులు తెచ్చి మరీ వరి పంటను వేశాను. వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాను. వేసిన పంట బాగానే ఉంది. మరో 20 రోజుల్లో పంట చేతికి వచ్చేది. ఇంతలో కురిసిన వడగండ్లు, ఈదురుగాలుల వర్షాలకు పంట మొత్తం తీవ్రంగా దెబ్బతింది. చేతికొచ్చే పరిస్థితి లేదు. అప్పులు తీర్చలేని పరిస్థితి. ప్రభుత్వం దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇస్తే ఎంతో కొంత మేలు జరుగుతుంది.

దేశ గతిని మార్చే వజ్రాయుధం ఓటు

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, మార్చి 22: దేశగతిని మార్చే ఓటు అనే వజ్రాయుధం మీ చేతిలో ఉందని, ఓటు ప్రాముఖ్యతను గుర్తెరిగి మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తప్పక ఓటు వేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ సింధూశర్మలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వాక్‌టూ పోలింగ్ స్టేషన్‌లో భాగంగా తక్కువ శాతం ఓటింగ్ నమోదైన కామారెడ్డి పట్టణంలో వడ్డెర కాలనీలోని 214వ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో 50-51 శాతం మేర ఓటింగ్ నమోదైన ప్రాంతాలు 5వేలు ఉన్నట్లు భారత ఎన్నికల సంఘం తెలిపిందని, అందులో కామారెడ్డి పట్టణంలోని 214వ బూత్ వడ్డెర కాలనీ, 255వ బూత్ శ్రీరాం నగర్ కాలనీలు ఉన్నాయని తెలిపారు. ఇందుకు గల కారణాలను విశ్లేషించి ఓటింగ్ పెరుగుదలకు స్వీప్ ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వడ్డెర కాలనీవాసులతో ముచ్చటించగా స్థానికంగా ఉన్న వారందరు ఓటు వేస్తున్నారని, కిరాయిదారులు, వలసదారులు ఓటింగ్ రోజు రాకపోవడం వల్ల ఓటింగ్ శాతం తగ్గి ఉండ వచ్చని తెలిపారు. దీంతో వారితో మాట్లాడి ఖచ్చితంగా ఓటేస్తానని శపథం తీసుకుని వందశాతం ఓటువేసేలా చూడాల్సిందిగా బూత్ స్థాయి అధికారులకు సూచించారు. వలస వెళ్లిన వారైె ఉంటే అక్కడ ఓటరుగా నమోదు చేసుకుని ఇక్కడ తొలగించుకొనుటకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ రావు, స్వీప్ నోడల్ అధికారి వెంకటేష్, బూత్‌స్థాయి అధికారి సుజాత తదితరులు పాల్గొన్నారు.

కేసులను సత్వరమే పరిష్కరించాలి

హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ

కామారెడ్డి టౌన్, మార్చి 22: కేసులను సత్వరమే పరిష్కరించాలని హైకోర్టు, అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి లక్ష్మీనారాయణ అలిశెట్టి అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా న్యాయస్థాన భవనంలో నూతన రెండో అదనపు ప్రథమశ్రేణి న్యాయ స్థానంను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు త్వరగా పరిష్కరించడమే తమ ధ్యేయమని కోర్టులకు వెళితే సత్వర న్యాయం జరుగుతుందనే నమ్మకం కక్షిదారుల్లో కలిగేలా న్యాయవ్యవస్థ పని చేయాలని అన్నారు. పెరుగుతున్న జనాభా కనుగుణంగా న్యాయస్థానాల ఏర్పాటు ఆవశ్యకత కూడా పెరిగిందని తెలిపారు. కేసులు త్వరితగతిన పరిష్కారం కావాలని, ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉండడం మంచిది కాదని తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాల కనుగుణంగా అందరు నడుచుకుని పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. న్యాయవ్యవస్థకు బార్-బెంచ్ రెండు చక్రాలాంటివని, రెండు సక్రమంగా పనిచేస్తేనే కేసులు సత్వర పరిష్కారమై కక్షిదారులకు న్యాయం చేకూర్చిన వారవుతామన్నారు. రెండో అదనపు ప్రథమ శ్రేణి న్యాయాధికారి జూనియర్ సివిల్ న్యాయాధికారి సుధాకర్ ఇన్‌చార్జీ బాధ్యతలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ సింధూశర్మ, సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగరాణి, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి దీక్ష, జిల్లాకోర్టు అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ శ్రీదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీ

లెక్క తప్పిందా.. లైసెన్స్ గోవిందా!

- ఎఫ్ఐవీ యాప్ తీసుకొచ్చిన ప్రభుత్వం
- ఎరువుల స్టాక్‌పై నిరంతర నిఘా
- వ్యవసాయ అధికారుల పనితీరుపైనా దృష్టి
- ఏవో నుంచి జేడీఏ వరకు ఫర్టిలైజర్ షాపుల తనిఖీలు
- లెక్కతప్పితే లైసెన్స్ రద్దుకు అవకాశం

కామారెడ్డి టౌన్, మార్చి 22: వ్యవసాయశాఖ ఫర్టిలైజర్ షాపుల్లో ఉన్న ఎరువుల నిల్వల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఎఫ్ఐవీ (ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్) యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కొరతను నివారించేందుకు ప్రభుత్వం ఎరువుల దుకాణాల వద్దకు వ్యవసాయ అధికారులు వారంలో రెండు రోజులు (సోమ, గురువారం) వెళ్లాలని సూచించింది. తద్వారా ఎరువుల కొరతకు కారణాలేంటనే దానిపై పరిశీలించి క్షేత్రస్థాయిలో లోపాలను గుర్తించి మరింత పాదర్శకంగా వ్యవస్థ ఉండేలా చేస్తోంది. ప్రత్యేక యాప్‌తో జిల్లాలోని ఎరువుల దుకాణాలను పరిశీలించి అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోనున్నారు. డీలర్లు ఎరువుల కొనుగోళ్ల, అమ్మకాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయకుండా లెక్క తప్పితే అధికా రులు ముందుగా నోటీసులు అందిస్తారు. మిషన్ రిపేరు లాంటివి జరిగిన ప్పుడు వెంటనే సమాచారం ఇచ్చి రిజిస్టర్‌లో నమోదు చేయాలి. అధికారుల తనిఖీల్లో ఎలాంటి తప్పులు దొర్లినా వెంటనే లైసెన్స్ రద్దు చేసేలా ఉన్నతాధికా రుల ఆదేశించారు.

గూగుల్ ద్వారా జీపీఎస్ విధానం

రైతులకు ఎరువుల కొరత లేకుండా చేసేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతుంది. ఫర్టిలైజర్ షాపు డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి రైతులకు ఎరువులు అందకుండా చేసి అధిక మొత్తంలో డబ్బులు చెల్లించకుండా ఉండేందుకు ప్రత్యేక నిబంధనలను అమలులోకి తెచ్చింది. వ్యవసాయ అధికారుల పనితీరును కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునేలా గూగుల్ యాప్ ద్వారా జీపీఎస్ విధానం అనుసరిస్తోంది. ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసిన అధికారి, ఆ షాపునకు వెళ్లినట్లుగా వెబ్‌సైట్‌లో పొందుపరిచేలా నిబంధనలు తీసుకొచ్చింది. వీటన్నింటిని రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఓ విభాగం ఎప్పటికప్పుడు గమనిస్తోంది. దీంతో ఎరువుల స్టాక్‌పై నిరంతర నిఘా ఉండడంతో పాటు వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో ఇటు వ్యవసాయ అధికారులు అటు ఎరువుల దుకాణదారులు పారదర్శకంగా వ్యవహరించనున్నారు.

తనిఖీలు ఇలా..

జిల్లాలోని ఫర్టిలైజర్ షాపుల్లో ఉన్న ఎరువుల నిల్వలను అధికారులు పరిశీలించి వాటిని యాప్‌లో నమోదు చేస్తారు. ఎరువుల బస్తాల వద్ద ఫొటోలు దిగి, స్టాక్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి, ఆ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. గతంలోనే షాపులను జీపీఎస్ ద్వారా ట్యాగ్ చేశారు. దీంతో షాపు వద్ద ఉండి గూగుల్ ద్వారా ఫొటో దిగి లోకేషన్‌ను కరెక్ట్‌గా పంపించాలి. దీని కోసం వారంలో సోమ, గురువారాల్లో ఏవో, ఏడీఏ, జేడీఏ స్థాయి అధికారులు నెలలో ఐదు సార్లు దుకాణాలు తనిఖీ చేయాలి. జిల్లాలోని అధికారులకు వారి పరిధిలోని ఐదు షాపులను కేటాయించుకున్నారు. దుకాణదారులు పీవోఎస్ యంత్రాలను ఉపయోగిస్తున్నారా లేదా వివరాలు ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం నిర్వహణ ఉందో లేదో తెలియజేయాలి. దీంతో ఎరువుల విక్రయాల తీరును జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు. కలెక్టర్, జేడీఏ మాత్రమే యాప్‌లోకి లాగినయ్యే అవకాశం ఉంటుంది. దీంతో కిందిస్థాయి అధికారులు తప్పనిసరిగా ప్రతీ దుకాణాన్ని తనిఖీ చేసి, పూర్తి వివరాలు పకడ్బందీగా నమోదు చేయాల్సిన అవసరం ఉంది.

రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
ఇఫ్తార్	సహర్
సా.6.34	ఉ.4.55



ఉపవాసికి (ఇఫ్తార్) దీక్ష విరమణ చేయించిన వారికి సైతం ఉపవాసికి లభించినంత పుణ్యం లభిస్తుంది

నిజామాబాద్ లీగల్, మార్చి 22 : ఓ మహిళను హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దొంగతనం చేసిన నేరానికి నలుగురికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. ఆర్మూర్‌లోని మామిడిపల్లి గ్రామానికి చెందిన తోకల చిత్ర అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతుండేది. తన అనారోగ్యానికి ఇంటి ఎదుట ఉన్న ఓ మహిళ చేతబడి చేస్తుందనే అనుమానం పెంచుకుంది. తన బంధువులైన బట్టు వెంకటేశ్, అతని స్నేహితుడు పందిర్ల రాజేంద ర్‌గౌడ్, బట్టు రంజిత్‌లతో కలిసి పథకం పన్ని 8-7-2018 నాడు మృతురాలి ఇంట్లోకి చొరబడి హత్య చేశారు. ఆ తర్వాత మృతురాలి మెడలో ఉన్న బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లి దోపిడి దొంగలు హత్య చేసినట్లుగా సృష్టించే ప్రయత్నం చేశారు. అప్పటి ఏసీపీ రవికుమార్ అనుమానితుల వేలిముద్రలు, సీసీ ఫుటేజీల ఆధారంగా వీరందరినీ అదుపులోకి తీసుకుని.. ఐపీసీ 302, 379 కింద కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నలుగురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ న్యాయాధికారి సునీత శుక్రవారం తీర్పునిచ్చారు.



మచ్చర్ల వైద్యశిబిరంలో మాట్లాడుతున్న ఏసీపీ బస్వారెడ్డి

క్యాన్సర్ నిర్మూలనకు కృషి చేయాలి

ఆర్మూర్ రూరల్, మార్చి 22: క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి అన్నారు. శుక్రవారం ఆలూర్ మండలంలోని మచ్చర్ల గ్రామంలో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ బస్వారెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్‌పై వస్తున్న అపోహలను ప్రజలు నమ్మవద్దన్నారు. సరైన, స్వచ్ఛమైన ఆహారం తీసుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాధిని దూరం చేయవచ్చన్నారు. క్యాన్సర్‌పై ఉన్న నమ్మకాలు, భయాందోళనకు గురవుతున్న ప్రజలకు తాము అండగా ఉంటామని, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వారు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. శిబిరంలో క్యాన్సర్ పరీక్ష, వివిధ రకాల క్యాన్సర్‌ల నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయడం వల్ల పేద ప్రజలకు ఆర్థిక బారం తక్కుతుందని అన్నారు. ఏఐపీకెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. క్యాన్సర రోగులకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి ప్రభుత్వాలు ఉచితంగా అందజేయాలని, క్యాన్సర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని క్యాన్సర్ రోగాన్ని తరిమికొట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పస్క నర్సయ్య, ఏఐపీకెఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవరాం, వీడీసీచైర్మన్ రాజ్‌కుమార్, కోశాధికారి అమృత్; మాజీసర్పంచ్ జి.నర్సయ్య, డాక్టర్ అశోక్, డాక్టర్ రమేష్, ప్రజా సంఘాల నాయకులు కిషన్, ఆకుల గంగారాం, మచ్చర్ల రాజన్న, అనిల్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఆర్మూర్ టౌన్, మార్చి 22: పట్టణంలో బార్ అసోసియేషన్‌లో శుక్రవారం ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ కమిటీని ఎన్నుకున్నారని ఎన్నికల అధికారులు గరడి ఆనంద్, తాళ్ల శ్రీనివాసులు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా పోడేటి శంకర్, ప్రధానకార్యదర్శిగా దేవరశెట్టి అరుణ్, సంయుక్త కార్యదర్శిగా సిందుకర్ చరణ్, కోశాధికారిగా తుమ్మ సుకేష్, గ్రంథాలయ కార్యదర్శి సూర సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని న్యాయవాదులు అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తులసీదాస్ క్రాంతి, కృష్ణపండిత్, చిల్క కిష్టయ్య, కృష్ణంరాజు, ఐనరి అశోక్, ప్రవీన్‌కుమార్, కోనేరు, మధు, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ ఆదేశించినా.. తీరని కష్టాలు!

● తెలంగాణ యూనివర్సిటీలో బాలికల హాస్టల్‌లో వసతుల కరువు
● ఇరుకుగా మారిన హాస్టల్ ● ఒకే భవనంలో 500మందికి వసతి ● 300 మందికి సరేపోయే భవనంలో విద్యార్థినులకు తప్పని తిప్పలు



టీయూలో దాదాపు 500 మంది విద్యార్థినులు ఉంటున్న బాలికల హాస్టల్ ఇదే..

డిచ్‌పల్లి, మార్చి 22: రాష్ట్ర అవతరణకు ముందే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం పేరుతో ఉన్న ఏకైక యూనివర్సిటీ డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీ. ఇంత ఘనమైన పేరున్న ఈ విశ్వవిద్యాలయంలో బాలికలకు తీవ్రమైన వసతి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం అవతరించి 10ఏళ్లు గడిచి, రెండో ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా.. వర్సిటీలో బాలికల వసతి సమస్య నేటికీ తీరాడం లేదు. ఎన్నో సార్లు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, రాష్ట్ర గవర్నర్‌కు వినతి పత్రాలు విద్యార్థులు అందించినా.. సమస్య పరిష్కారం కావడం లేదు. రూరల్ శాసన సభ్యుడు డా. భూపతిరెడ్డి, స్థానిక బాలికల వసతి గృహం పట్ల ప్రత్యేకచొరవ చూపి నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని హాస్టల్ విద్యార్థినులు, వారి తల్లి దండ్రులు కోరుతున్నారు. తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధిపై నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తవించారు. ఇక్కడి సమస్యలు తీర్చాలని, వెంటనే టీయూ కు నిధులు కేటాయించి వర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అయిన నేటికి ప్రభుత్వం కనీసం స్పదించటేదు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థినులు ఇక్కడికి పీజీ, ఉన్నత చదువుల కోసం వస్తుంటారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ హాస్టల్ సమస్య తీవ్రంగా వేధిస్తున్నా.. ప్రభుత్వ పెద్దలు, ఉన్నత విద్యా మండలి స్పందించకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పీజీ కోర్సుల్లో అన్ని విభాగాల్లో విద్యార్థినులే అధిక శాతం సీట్లు వంద శాతం సీట్లలో 72 మంది విద్యార్థినులే సీట్లు సాధిస్తున్నారు. దీంతో వర్సిటీలోని బాలికల హస్టల్ లోని ఒక్కో గదిలో 5నుంచి ఆరుగురు ఉండాల్సి ఉండగా.. 10 నుంచి 15మంది సర్దుబాటు చేసుకుంటున్నారు. గత విద్యా సంవత్సరంలో తెలంగాణ యూనివర్సిటీలో 1,851 మంది విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరగా 1,226 మంది బాలికలు పీజీ కోర్సులో ప్రవేశం పొందారు. గతంలో ఎన్నడూ లేని ఈ విధంగా పీజీ కోర్సుల్లో అమ్మాయిలు ఎక్కువగా చేరుతుండటంతో హాస్టల్ అకాంబిడేషన్ ఇబ్బందిగా మారింది. దీంతో యూనివర్సిటీ అధికారులు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులో చేరే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించకుండా ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. గత పదేళ్ల క్రితం 300 మంది కోసం కట్టిన బాలికల హాస్టల్‌లో ప్రస్తుతం 500 మంది ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కెమిస్ట్రీ, తెలుగు, ఇతర డిపార్టుమెంట్‌లలో 30 నుంచి 60 సీట్లకు పెంచిన హాస్టల్ వసతి మాత్రం పెంచడం లేదనిని, దీంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని విద్యార్థినులు వాపోతున్నారు.

● ఒకే భవనంతో తీవ్ర ఇబ్బందులు

గతంలో విశ్వవిద్యాలయానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సందర్శించిన సమయంలో విద్యార్థినులు, బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని, ఒకే హాస్టల్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఆమెకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే సమస్య పరిష్కరించేందుకు స్వయంగా హాస్టల్ సందర్శించిన గవర్నర్ హామీ ఇచ్చి సంవత్సర కాలం దాటినా.. ఇంత వరకు హాస్టల్ వసతి నిర్మాణానికి చిల్లిగవ్వ కూడా ప్రభుత్వం మంజూరు చేయాలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే సైతం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కావడంతో, ఇప్పటికైన తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి సీఎం, మంత్రుల తెలియజేసి హాస్టల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా స్థానిక ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి కృషి చేయాలని విద్యార్థినులు వేడుకుంటున్నారు.

పోషక ఆహారాన్ని తప్పక తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారిణి రసూల్‌బీ

● పోషణ పక్షోత్సవాల్లో జిల్లా అధికారిణి రసూల్‌బీ

ఆర్మూర్ టౌన్, మార్చి 22: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేసే పోషకాలతో కూడిన ఆహారాన్ని గర్భిణీలు, పిల్లలు, బాలింతలు క్రమం తప్పకుండా తీసుకోవాలని జిల్లా అధికారిణి రసూల్‌బీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జెండగల్లీలోని ఓ పంక్షన్‌హాల్‌లో పోషణ పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడి కేంద్రాల టీచర్‌లు, గర్భిణీలు చిన్న పిల్లల తల్లులకు పౌష్టికాహారంపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారిణి రసూల్‌బీ మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు తాజా ఆకు కూరలు, సిరి ధాన్యాలు తప్పకుండా తీసుకోవాలని, ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ రాజు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ మహేష్, ఎన్విరల్‌మెంట్ ఇంజనీర్ పూర్ణమౌళి, సీడీపీవో పద్మభార్గవి, ఏసీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్ నళిని, అంగన్‌వాడీ టీచర్‌లు లక్ష్మీ, పద్మ, తదితరులున్నారు.

జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పల్లికొండ విద్యార్థులు

భీమ్‌గల్ రూరల్, మార్చి22: భీమ్‌గల్ మండలంలోని పల్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థులు గీతిక, సంజన, బాలకృష్ణ అనే ముగ్గురు మహబూబాబాద్ తొర్రూరులో జరిగిన టోర్నీలో అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈనెల 28 నుంచి 31 వరకు ఘజియాబాద్ ఉత్తరప్రదేశ్ లో జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

డిచ్‌పల్లి, మార్చి 22: రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మిట్టపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి భూక్య దేవేందర్ ఎంపికయ్యాడని వ్యాయామ ఉపాధ్యాయుడు గంగామోహన్ తెలిపారు. విద్యార్థి దేవేందర్‌ను శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సుశీల్ కుమార్, ఉపాధ్యాయుల బృందం అభినందించారు. ఈనెల 11న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆర్మూర్‌లో జరిగిన జిల్లా సబ్‌జూనియర్ జట్టు ఎంపికలో దేవేందర్ పాల్గొని ప్రతిభ కనబరి ఈనెల 23 నుంచి 24 వరకు యాదాద్రి జిల్లా అలేరులో జరగనున్న రాష్ట్ర సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటారని గంగామోహన్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి అవార్డు తేవాలని ఆ కాంక్షించారు. ఇందులో హెచ్‌ఎం సుశీల్ కుమార్, రాజశేఖర్, రాఘవేందర్, పోశెట్టి, బాలరాజు, నిరంజన్, శ్రీధర్‌లు అభినందించారు.

'నాసిరకం ఎరువులపై విచారణ చేపట్టాలి'

ఆర్మూర్ రూరల్, మార్చి 22: పెర్కిట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు పంపిణీ చేసిన నాసిరకం ఎరువుల పంపిణీపై విచారణ జరిపించాలని డైరెక్టర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం పెర్కిట్ సొసైటీలో సమావేశమైన డైరెక్టర్‌లు నాసిరకం ఎరువులు రైతులకు పంపిణీ చేయడం పట్ల రైతులు నష్టపోయారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక కమిషన్‌ల కోసం నాసిరకం ఎరువులను సరఫరా చేశారని ఆరోపించారు. సొసైటీ చైర్మన్ బోజారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎరువులు సరఫరా చేసే మార్క్‌ఫెడ్ సంస్థ నుంచి సకాలంలో ఎరువులు రాకపోవడంతో అగ్రిమార్ట్ నుంచి ఎరువులను కొనుగోలు చేసి రైతులకు అందజేశామన్నారు. వ్యవసాయాధికారుల సూచన మేరకు ఆ ఎరువులను నిలిపివేశామన్నారు. ఎరువుల పంపిణీలో తాము ఎలాంటి అవకతవకులకు పాల్పడలేదని, ప్రతీ రశీదును భద్రంగా ఉంచామని ఈ విషయమై జిల్లా సహకార అధికారి, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ జరపాలని కోరారు.

ఆలూర్ సొసైటీలో సర్వసభ్య సమావేశం

ఆర్మూర్ రూరల్, మార్చి 22: ఆలూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం చైర్మన్ తంబురి శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆదాయ వ్యయాల నివేదికను సీఈవో మల్లేష్ చదివి వినిపించారు. సొసైటీ ద్వారా రైతులకు అందజేసే పంట రుణాలను రూ.2లక్షల వరకు పెంచాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్‌లు కల్లెం బోజారెడ్డి, గోవర్ధన్, సంతోష్‌రెడ్డి, కల్లెం సాయిరెడ్డి, కట్ట నర్సయ్య, ఆరే రాజేశ్వర్, ప్రమోద్, వెల్మ నర్సారెడ్డి, మల్లుబాయి, పచ్చుల లస్మబాయి, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

జక్రాన్‌పల్లి, మార్చి 22: మండలంలోని బ్రహ్మణ్‌పల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. శుక్రవారం గ్రామంలో సుమారు 899 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారిణి డాక్టర్ శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాల మిత్ర రాజ్‌కుమార్, పశువైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'జయంతి ఉత్సవాలు నిర్వహించాలి'

ముప్కాల్, మార్చి 22: ఏప్రిల్ 1 మొదటి నుంచి అంబేద్కర్ జయంతి వరకు ఉత్సవాలు నిర్వహించాలని తాపస్ జిల్లా ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఒడ్నాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలోని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి బాల్కొండ మండల శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్‌లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు. ఇందులో బాల్కొండ మండల కార్యదర్శి మగ్గిడి రాజేంధర్, రాజ్యలక్ష్మీ, మండల అధ్యక్షుడు సుంకం రవికుమార్, మెండోర మండల అధ్యక్షురాలు రమాదేవి, జ్యోతి, విజయానంద్, తదితరులు పాల్గొన్నారు.



రైలు పట్టాలు మార్పు చేసేందుకు వచ్చిన కూలీలు

రైల్వే పాత పట్టాల తొలగింపు

● కొత్త పట్టాల బిగింపు కోసం ప్రారంభమైన పనులు

డిచ్‌పల్లి, మార్చి 22: రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత 30 ఏళ్ల క్రితం వేసిన రైల్వే పట్టాల స్థానంలో నూతన రైల్వే పట్టాలు వేసేందుకు శుక్రవారం ప్రత్యేక రైలులో రైలు పట్టాలను తీసుకొచ్చి పట్టాల పక్కన కూలీలతో పనులు ప్రారంభించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రెండు వైపుల రైల్వే గేటు వేసి వాహన రాకపోకాలను నిలిపివేసి పట్టాలను వేసుకుంటు ముందుకు సాగారు. గతంలో బిగించిన పట్టాలు 13 మీటర్లు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం 200 మీటర్ల పొడువైన ఇనుప ట్రాక్‌లను ఏర్పాటు చేస్తున్నామని రైల్వే అధికారి తెలిపారు. రైలు పట్టాలు బిగించేందుకు వచ్చిన వాహనంలో 50మంది కూలీలు ఇనుప చైనుల సహాయంతో ట్రాక్ పక్కన పట్టాలను దింపుతున్నారు. నూతన ఏర్పాటు పట్టాల ఏర్పాటుతో ఒక గంట పాటు రోడ్డుకు రెండు వైపుల వాహనాలను నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

'పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలి'

ముప్కాల్, మార్చి 22: ప్రతీ విద్యార్థిలో ఏదో ఒక కళ ఉంటుందని, దానిని వెలికితీసి పిల్లల అభివృద్ధికి తోడ్పాడాలంటు ప్రముఖ సైకార్టిస్టు మోటివేషనల్ స్పీకర్ జిఎవి.కుమార్ అన్నారు. శుక్రవారం ముప్కాల్ మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో పిల్లల పెంపకం ఒక కళ అనే అంశంపై నిర్వహించిన సేమినార్‌లో విద్యార్థిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లల పెంపకంపై తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థి అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాత్ర ఎంతో ఉందని సూచించారు. ఈ కారయక్రమంలో కృష్ణవేణి పాఠశాల జోనల్ ఇన్‌చార్జీ శేఖర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కోట ప్రవీన్, పాఠశాల వైస్‌ప్రిన్సిపాల్ రాజేంధర్, డైరెక్టర్‌లు ధర్మపురి, నర్సయ్య, రాజేంధర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'నీటి ప్రవాహ ప్రాంతాల్లోకి వెళ్లొద్దు'

ముప్కాల్, మార్చి22: రానున్న హోలీ పండగ సందర్భంగా యువకులు, పిల్లలు సమన్వయం పాటించి నీటి ప్రవాహక ప్రాంతంలోకి వెళ్ళవద్దని ఎస్సై బాస్కరచారి సూచించారు. హోలీ పండగ సందర్భంగా పాఠశాలలకు సెలవులలో విద్యార్థులు కాలువలు గాని, డ్యామ్ పరిసర ప్రాంతల్లో వెళ్లవద్దని సూచించారు. యువకులు హోలీ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఏలాంటి అవాంచనీయ జరగకుండా చూడాలన్నారు. మద్యం మత్తులో నీటి ప్రవాహక ప్రాంతాల్లోకి వెళ్ళవద్దని ద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలని ఎస్సై సూచించారు.

ఓటు హక్కుపై అవగాహన

ఆర్మూర్ టౌన్, మార్చి 22: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రైమరీ పాఠశాలలో తహసీల్దార్ కె.గజానన్ శుక్రవారం బీఎల్‌వో, మెప్మా ఆర్‌పీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని, గత ఎన్నికల్లో తక్కువగా నమోదైన పోలింగ్ శాతాన్ని పెంచేలా ప్రతీ ఇంటికి వెళ్ళి ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. క్యాక్రమంలో ఎంపీడీవో సాయిరాం, ఎన్నికల డీటీ పద్మ, ఆర్ఐ అశోక్‌సింగ్, మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, బీఎల్‌వోలు, ఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ్‌పల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

జక్రాన్‌పల్లి, మార్చి 22: మండలంలోని బ్రహ్మణ్‌పల్లి గ్రామంలో సాంఘీక సంక్షేమ ఆర్మూర్ మహిళ గురుకుల డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం కొనసాగుతోంది. మన గుడి-మన బడి కార్యక్రమంలో భాగంగా గుడి, బడి ప్రాంగణాలను శుభ్రం చేశారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు నీటి యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారిణి కె.చైతన్య శాంతి, ప్రోగ్రాం సభ్యులు భవిత, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



టీయూలో బాలికల హాస్టల్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

నూతన బాలికల హాస్టల్‌ను నిర్మించాలి

● బాలికల హాస్టల్ ఎదుట ఏబీవీపీ ధర్నా

డిచ్‌పల్లి, మార్చి 22: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో , తెలంగాణ వర్సిటీలో నూతన బాలికల హాస్టల్ నిర్మించాలని విద్యార్థినులతో కలిసి శుక్రవారం బాలికల హాస్టల్ ఎదుట ఆందోళన చేశారు. వర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ.. వర్సిటీలో బాలికల వసతి గృహంలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ఒక్కో గదిలో 10 మంది విద్యార్థినులు ఉంటున్నారని, ఇరుకుగా మారడంతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. గదుల్లో ఎక్కువ మంది విద్యార్థినులు ఉండటంతో ఆనారోగ్య సమస్యలు వస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే చొరవ చూపి నూతన బాలికల వసతి గృహం నిర్మించాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయంలో బాలికలకు పీఈటీ లేకపోవడంతో క్రీడలకు దూరం అవుతున్నారని వసతి గృహంలో తాగు నీరు కొరత ఏర్పాడుతుందని, అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే బాలికల హాస్టల్ సమస్యతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందులో అమృత్, పావని, అనిల్, మణి, మహర్షి, పాల్గొన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ, ఐఎంబీఏ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

డిచ్‌పల్లి, మార్చి 22: తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలోని ఎంబీఏ. ఎంసీఏ, ఐఎంబీఏ, 10 వసెమిస్టర్ రెగ్యూలర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు సంబంధించిన పరీక్షల ఫీజు అపరాధ రుసుముతో పొడగించినట్లు సీవోఈ ప్రొ.అరుణ తెలిపారు. ఫీజు చెల్లించెందుకు చివరి తేదీ ఏప్రిల్ 1 వరకు ఉండగా, 100రూ. అపరాధ రుసుముతో ఏప్రిల్ 4 వరకు, ఫీజు చెల్లించేందుకు ఆవకాశం ఉందన్నారు. ఎంబీఏ, ఎంసీఏ, ఐఎంబీఏ, ఒక్కో సబ్జెక్టు కు 250రూ.కాగ, రెండు సబ్జెక్టుల కంటే ఎక్కువగా ఉంటే 800రూ. చెల్లించాలని సీవోఈ తెలిపారు. పూర్తి సమాచారం కోసం తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ చూడలన్నారు.

కిరణ్ మృతి తీరని లోటు : ఐఎఫ్‌టీయూ

కమ్మర్‌పల్లి, మార్చి 22: భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకుడు తెలంగాణ ప్రగతశీల ఆటోవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మాస్‌లైన్(ప్రజాపంథ) నాయకుడు కిరణ్ మృతి విప్లవ కార్మికోద్యమానికి తీరని లోటని బలమైన విప్లవకార్మికోద్యమ నిర్మాణమే ఆయనకు నిజమైన నివాళిఅని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ రమేష్, ఉపాధ్యక్షురాలు సత్తెక్క అన్నారు. కమ్మర్‌పల్లిలోని మండల పార్టీ కార్యాలయంలో శుక్రవారం కామ్రెడ్ కిరణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతు ప్రజల్లో కార్మిక రంగం కలిసిపోతూ యూనియన్ చురుకైన పాత్ర పోషించారణి కొనియాడుతూ ఆయన సేవల్ని గుర్తు చేశారు. మలిదశ తెలంగాణ ఉద్య మంలో ఆర్టీసీ కార్మికుల పోరాటంలో ఆయన ముఖ్యపాత్ర పొషించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథ), ఐఎఫ్‌టీయూ, ఏఐపికేఎస్, ఏఐపికేఎంఎస్ డివిజన్, మండల నాయకులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను ప్రతిఘటిద్దాం

● పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు

మోర్తాడ్, మార్చి 22: దేశంలో మోదీ అనుసరిస్తున్న మతోన్మాద పాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని ప్రగతి శీల మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు వి.గోదావరి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో పీవోడబ్ల్యు మండల కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాజంలో అన్ని వర్గాల మహిళల పట్ల తీవ్ర వివక్షత, పురుష దుహంకారదాడులు కొనసాగుతూ పురుషాధిపత్యం రాజ్య మేలుతుందని పోరాడాలని అన్నారు. దేశంలో పేద, దళిత, ఆదివాసి మైనారిటీ స్త్రీలపై దోపిడి అణిచివేత, లైంగికదాడులు, వరకట్న దురాచారాలు, ప్రేమపేరుతో జరిగే దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. అన్ని రకాల హింసాలకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతు కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలని పీవోడబ్ల్యు పిలుపు నిస్తుందన్నారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెమ్మ, మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు డి.అశోక్, జి.కిషన్, యమున, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు వి.గోదావరి

'ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి'

మద్నూర్, మార్చి 22: ఎన్నికల పర్వం దేశానికి గర్వమని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ ముజీబ్ సూచించారు. శుక్రవారం మద్నూర్ తహసీల్దార్ కార్యాలయం నుంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల వరకు ఓటరు చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు హక్కు అనేది ఓటు వేసే వారి భవిష్యత్తు నిర్వహిస్తుందని, ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఓటర్లు పాల్గొన్నారు.

గున్కుల్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు

నిజాంసాగర్, మార్చి 22: మండలంలోని గున్కుల్ గ్రామంలో గ్రామస్థులంతా కలిసి గ్రామంలో 8 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామంలో అందరూ కలిసి ఆయా చోట్ల 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంసాగర్ ఎస్సై, పోలీసులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ రుణాలను చెల్లించాలి

గాంధారి, మార్చి 22: గాంధారి సింగిల్ విండో ఎన్‌డీసీసీబీ బ్యాంకులో తీసుకున్న అన్ని రుణాలను చెల్లించాలని బ్యాంకు సిబ్బంది శుక్రవారం మండలంలోని చద్మల్‌తండాలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రుణాలను సక్రమంగా చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని సూచించారు. 8 లక్షల నుంచి బకాయిలను రికవరీ చేసి బ్యాంకులో జమ చేశారు. బ్యాంకు పరిధిలో రుణాలు చెల్లించకుంటే తిరిగి భూములను జప్తు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయికుమార్, సింగిల్‌విండో కార్యదర్శి మోహన్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ రాజేందర్, రోహిత్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

జూనియర్ కళాశాలలో అదనపు గదులు నిర్మించాలి

కామారెడ్డి టౌన్, మార్చి 22: కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు గదులు నిర్మించాలని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి ఏబీవీపీ నాయకులు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 586 మంది విద్యార్థులు కళాశాలలో చదువుతుండగా సరిపడా తరగతి గదులు లేనందున విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. నూతనంగా గదులు నిర్మించి కెమిస్ట్రీ, ఫిజిక్స్‌ల్యాబ్‌లు, లైబ్రరీ కోసం గదులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ చరణ్, హాస్టల్ కన్వీనర్ ఖలీల్, కార్యకర్తలు సాయిచరణ్, అల్తాఫ్, రాజు పాల్గొన్నారు.

తాడ్వాయిలో పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే

తాడ్వాయి, మార్చి 22: మండలంలో శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కే.మదన్‌మోహన్ నష్టపోయిన పంటలను పరిశీలించారు. మండలంలోని బ్రహ్మాజీవాడి, కృష్ణాజీవాడి, తాడ్వాయి గ్రామాల్లో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ పంటలు అకాల వర్షానికి నష్టపోయాయి. ఎంత శాతం పంట నష్టపరిహారం జరిగిందనే విషయాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. రైతులు ఎలాంటి దిగులు చెందవద్దని నష్టపోయిన పంటలపై ప్రభుత్వం వివరాలు సేకరిస్తుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకట్రావు, రెడ్డి, జంగంరాజు, సుగుణాకర్‌రెడ్డి, అఖిల్‌రావు, షౌకత్‌అలీ, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ కో ఆర్డినేటర్‌గా మురళి

లింగంపేట, మార్చి 22: మండల కేంద్రానికి చెందిన మహారాజుల మురళిని బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ ఓబీసీ మోర్చా కోఆర్డినేటర్‌గా నియమిస్తూ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అనంద్‌గౌడ్ శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. జహీరాబాద్ పార్లమెంట్‌లో బీజేపీ జెండాను ఎగురవేస్తామని ఆయన అందుకు బీజేపీ కార్యకర్తలను సైనికులుగా తయారు చేస్తామని మురళి అన్నారు.

మద్నూర్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సాయిలు

మద్నూర్, మార్చి 22: జుక్కల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నూతన అధ్యక్షులను కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ నియమించారు. మద్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా దరాస్ సాయిలు, డోంగ్లీ మండలాధ్యక్షుడిగా బస్వరాజ్ పటేల్‌లను ఎంపిక చేసినట్లు కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపికైన కాంగ్రెస్ అధ్యక్షులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని అభివృద్ధి వైపు తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేందర్ రెడ్డి

పెద్ద కొడప్‌గల్, మార్చి 22: పెద్ద కొడప్‌గల్ మండల అధ్యక్షుడిగా మహేందర్ రెడ్డిని నియమించినట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావ్ తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో నూతనంగా అధ్యక్షులను నియమించామన్నారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నిరసన

మాచారెడ్డి, మార్చి 22: కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నోటికి గుడ్డ కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇలియాస్ ఆదేశాల మేరకు, అసెంబ్లీ అధ్యక్షుడు ఐరేని సందీప్ ఆధ్వర్యంలో మాచారెడ్డి మండల కేంద్రంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నోటికి నల్లబట్ట కట్టుకుని, మోదీ బీజేపీ ప్రభుత్వం చర్యకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజురెడ్డి మాట్లాడుతూ ఇండియన్ యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ యొక్క అన్ని సోషల్ మీడియా ఖాతాలను కేంద్రప్రభుత్వం స్తంభింపచేశారని అన్నారు. ఇది పూర్తిగా బీజేపీ పాలక ప్రభుత్వానికి గుండారాజ్యపు చర్య అని అన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని రానున్న ఎన్నిక ల్లో బీజేపీ ప్రభుత్వ కుట్రపూరిత రాజకీయాలను వ్యతిరేకిస్తూ బీజేపీని గద్దెదించి కాంగ్రెస్‌కు పట్టం కట్టె రోజులు దగ్గరలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజిరెడ్డి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు నూతికాడి బద్రి, గస్‌పూర్ యువజన అధ్యక్షుడు సంతోష్, భుక్యా రవినాయక్, సుధాకర్, లక్ష్మణ్, సంతోష్ రెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం దోమకొండలో అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ ఆదేశాల మేరకు ఇండియన్ యూత్ కాంగ్రెస్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సోషల్ మీడియా ఖాతాలను కేంద్ర ప్రభుత్వం స్తంభింప చేసినందుకు నోటికి నల్ల బట్ట కట్టుకుని, చేతులకు సంకెళ్లు వేసుకుని అంబేద్కర్ విగ్రహం వద్ద మోదీ బీజేపీ ప్రభుత్వం చర్యకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఫణీంద్ర, నరేష్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్, స్వామి, ప్రభాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓటు వేసిన ప్రజల రుణం తీర్చుకుంటా : ఎమ్మెల్యే తోట

పెద్ద కొడప్‌గల్, మార్చి 22: తనకు ఓటు వేసి గెలిపించిన జుక్కల్ ప్రజల రుణం తీర్చుకుంటానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ పేర్కొన్నారు. శుక్రవారం పెద్ద కొడప్‌గల్ మండలంలోని విఠల్‌వాడి, విఠల్‌వాడి తండా, పోచారం తండా, శివ్వాపూర్, బూర్గుపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం శివ్వాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తోట మాట్లాడారు. తాను జుక్కల్ నియోజక వర్గానికి కొత్తవాడినైన తనను ఈ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించారని, అటువంటి ప్రజల సమస్యలు తీర్చి వారి రుణం తీర్చుకుంటానని అన్నారు. తాను 2 నెలల కాలంలో జుక్కల్ నియోజక వర్గంలో తాగునీరు, సీసీ రహదారులు, కమ్యూనిటీ భవనాలు తదితర అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. జుక్కల్ నియోజక వర్గంలో 167 గ్రామాలకు తాగునీటి సమస్యను తీర్చానన్నారు. బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్న పిల్లల ఐసీయూ వార్డు ఏర్పాటు చేశానన్నారు. ఇక జహీరాబాద్ ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ తన స్వప్రయోజనాల కోసం బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వెల్లాడే తప్ప అభివృద్ధి చేయడానికి కాదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు చిప్ప మోహన్, పండరి, సంజీవ్, నాగిరెడ్డి, రమేష్ దేశాయి, మల్లప్ప పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

- పాఠశాలలో షీ టీమ్ అవగాహనతో వెలుగు చూసిన ఘటన
- ఉపాధ్యాయుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

నాగిరెడ్డిపేట, మార్చి 22 : బాలికలకు విద్యాబుద్ధులు నేర్పి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. ఇద్దరు విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురి చేసిన ఘటన నాగిరెడ్డిపేట మండలంలోని ఓ గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నాగిరెడ్డిపేట మండలంలోని ఓ గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం పెంటాకలాన్ గ్రామానికి చెందిన గుండారం ప్రవీణ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నాడు. ఈ పాఠశాలలో గురువారం జిల్లా షీ టీమ్ సభ్యులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించారు. దీంతో ఉపాధ్యాయుడు గుండారం ప్రవీణ్ తమపై జరుపుతున్న లైంగిక వేధింపుల గురించి విద్యార్థినులు షీ టీమ్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఉపాధ్యాయుడి ప్రవర్తనపై విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకున్న షీ టీమ్ సభ్యులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు సంబంధిత పాఠశాలలో ఈ విషయమై విచారణ జరిపారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 12సంవత్సరాల లోపు ఇద్దరు విద్యార్థినులపై సదరు ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు తేల్చారు. ఉపాధ్యాయుడు తన సెల్‌ఫోన్‌లో అశ్లీలకరమైన చిత్రాలను విద్యార్థినులకు చూపిస్తూ వారిని లైంగిక వేధింపులకు గురి చేశాడని తన విచారణలో తేలిందన్నారు. బాధిత విద్యార్థినుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడు గుండారం ప్రవీణ్‌పై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం

ఎల్లారెడ్డి, మార్చి 22: ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుగా కురుమ సాయిబాబా, లింగంపేట బుర్ర నారాయణగౌడ్, నాగిరెడ్డిపేట శ్రీధర్‌గౌడ్, సదాశివనగర్ జుకంటి సంగారెడ్డి, గాంధారి మోహన్‌నాయక్, తాడ్వాయి జుకంటి వెంకట్ రెడ్డి, రామారెడ్డి, గొల్లపల్లి లక్ష్మాగౌడ్, రాజంపేట యాదవరెడ్డిలకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన నియామక పత్రాలను శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు చేతుల మీదుగా అందజేశారు. అదే విధంగా ఎల్లారెడ్డి మండల యూత్ అధ్యక్షులుగా సంతోష్, నాగిరెడ్డిపేట్ శ్రీరామ్‌గౌడ్, లింగంపేట్ సుప్పల రాజు, తాడ్వాయి అఖిల్‌రావు, గాంధారి బీస గణేష్, రాజంపేట సయ్యద్ సల్మాన్, రామారెడ్డి ఆనంద్, సదాశివనగర్ అన్వేష్‌గౌడ్‌లను నియమించారు.

ఎమ్మెల్యే సమక్షంలో పలువురు పార్టీలో చేరికలు

మద్నూర్, మార్చి 22: మండలంలోని పెద్ద శక్కర్గ గ్రామంలో మాజీ సర్పంచ్ బాబు పటేల్, శంకర్ రావులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం పెద్ద శక్కర్గలో జరిగిన సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద శక్కర్గ మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు పార్టీలోకి ఆహ్వానించారు. అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ అమలు చేస్తామన్న 5 హామీలను నెరవేర్చామన్నారు. ఈ కార్యక్రమంలో మోయిన్ పటేల్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ సర్పంచ్

రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నాగులపల్లి రాజేందర్ బీఆర్ఎస్ పార్టీని వీడి రాష్ట్రప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్ చేరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, జిల్లా పరిషత్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ జడ్పీటీసీ నారెడ్డిమోహన్‌రెడ్డి, నాయకులు రెడ్యానాయక్, మోతిరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: మాచారెడ్డి, పాల్వంచ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పి జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్, జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ నారాగౌడ్, లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ డైరెక్టర్‌తో తోట బాల్‌లింగం, మాజీ ఎంపీటీసీ గ్యారచంద్రం, తోట సాయిలు, వడ్ల హరీష్, రాజగోపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంటక్‌రెడ్డి, లక్ష్మీనరసింహ తదితరులు ఉన్నారు.

నష్టపోయిన పంటల వివరాలను అధికారులు సేకరించాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, మార్చి 22: వడగళ్లవానకు రైతులు నష్టపోయిన పంటల వివరాలు వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి తీసుకోవాలని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పంట నష్టపోతే అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లకుండా అంచనాలు వేస్తున్నారని ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ రైతుల కష్టాలను తెలుసుకుని పంట నష్ట వివరాలను సేకరించాలని అన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో మూడు మండలాల పరిధిలో తీవ్ర పంటనష్టం ఏర్పడిందని నష్టం జరిగిన ప్రతీ రైతు వివరాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. గతంలో మాదిరి పంట నష్టపరిహారం రైతుల ఎంపిక విషయంలో ఏ ఒక్కరైతును విస్మరించినా ఊరుకునేది లేదని అన్నారు. అదేవిధంగా పంటనష్టపోయిన రైతులకు ఇవ్వకుండా ఇతరులకు డబ్బులు ఇచ్చే ప్రయత్నాలు చేయవద్దని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల విషయంలో సహాయ కార్యక్రమాలకు ఎన్నికల కోడ్ ఏమి అడ్డు రాదని అన్నారు. పంట నష్టపోయిన ప్రతీ రైతుకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం అందించి తీరాలని అన్నారు. అదేవిధంగా ఎలక్ట్రిసిటి అధికారులు పంటపొలాల్లో పడిపోయిన స్తంభాలు, ఇతర నష్టాలకు రైతుల నుంచి డబ్బులు తీసుకో కుండా త్వరితగతిన పునరుద్ధరణ చేయాలని, రైతుల నుండి డబ్బులు అడగవద్దని తెలిపారు.

గొట్టిముక్కులలో వైద్య శిబిరం విజయవంతం

దోమకొండ, మార్చి 22: మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో గురువారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం విజయవంతం అయినట్లు ఆ సంస్థ చైర్మన్ బుర్రి రవి రవి కుమార్ తెలిపారు. గ్రామంలో వృద్ధులకు, వికలాంగులకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, కంటి చూపు, ఇతర వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, వైస్ చైర్మన్ నాగరాజ్‌గౌడ్, సెక్రటరీ రఘు కుమార్, డివిజన్ వైస్ చైర్మన్ పున్న లక్ష్మణ్, డివిజన్ డైరెక్టర్ కంది వినోద్ కుమార్, మండల వైస్ చైర్మన్ ముదాం శంకర్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా హెల్త్ కో ఆర్డినేటర్ వైద్యులు విక్రమ్ కుమార్ పాల్గొన్నారు.

వికలాంగులు, వయో వృద్ధులకు

ఇంటి వద్దనే పోలింగ్ ఏర్పాటు చేయాలి

- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి

మద్నూర్, మార్చి 22: వికలాంగులు, వయో వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాలకు రాని వారికి ఇంటి వద్దే ఓటు వేసేలా ఏర్పాటు చేయాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మద్నూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఫాం 12డి ద్వారా పోలింగ్ కేంద్రాలకు రాలేని వికలాంగులు, వయో వృద్ధులు (85 సంవత్సరాలు పైబడిన వారు) ఓటు హక్కు ఇంటి వద్దే వినియోగించుకునేలా భారత ఎన్నికల కమిషన్ కల్పించిందని, గ్రామీణ ప్రాంతాల్లో బీఎల్‌వోలు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా జాగ్రత్తగా గుర్తించి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ హోం ఓటింగ్ షెడ్యూల్ ప్రకటించిన వెంటనే దరఖాస్తు చేసుకున్న వారు ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, డిప్యూటీ తహసీల్దార్ భరత్, విజయ్, ఆర్ఐ శంకర్, తదితరులున్నారు.



మద్నూర్‌లో బీఎల్‌వోలతో మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

మత్తు పదార్థాలను అమ్మిన నలుగురి అరెస్ట్

సదాశివనగర్, మార్చి 22: మండలంలోని పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డులో నిషేధిత మత్తు పదార్థాలు అమ్మిన నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్నేహ పౌల్ట్రీ ఫారం వద్ద హోండాసిటీకారులో ఇద్దరు వ్యక్తులు అల్ప్రాజోలం అమ్ముతున్నారనే సమాచారంతో సదాశివనగర్ ఎస్ఐ తన సిబ్బందితో కలిసి స్నేహ పౌల్ట్రీ ఫాం వద్దకు వెళ్లగా అప్పటికే కారులో ఇద్దరు వ్యక్తులు ఉన్నారని మరో ఇద్దరు కూడా రెండు మోటార్ సైకిళ్లపై అక్కడికి వచ్చి అల్ప్రాజోలం కొనుగోలు చేస్తున్న సమయంలో పట్టుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా రాజస్థాన్‌కు చెందిన భవానీసింగ్, ముఖేష్‌సింగ్ అనే వ్యక్తుల ద్వారా తక్కువ ధరలకు అల్ప్రాజోలం కొనుగోలు చేసి వారి యొక్క కల్లు వ్యాపారంలో వాడుతున్నారని తెలిపారు. ఇందులో మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌కు చెందిన చోపరి ప్రశాంత్‌గౌడ్, గంభీరావుపేట మండలానికి చెందిన పపురి రాజుగౌడ్, పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డుకు చెందిన బండమీది బాలాగౌడ్, సదాశివనగర్ మండలం కల్వరాల్‌కు చెందిన ఎండీ వాజీద్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐ సంతోష్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య, సదాశివనగర్ ఎస్ఐలను ఎస్పీ సింధూశర్మ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

బాలికతో వ్యభిచారం చేయిస్తున్న ముగ్గురి అరెస్ట్

కామారెడ్డి టౌన్, మార్చి 22: కామారెడ్డి పట్టణంలో మైనర్ బాలికతో వ్యభిచారం చేయిస్తున్న ముగ్గురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బాలికను ఆమె చిన్నమ్మ వద్ద నుంచి డబ్బులకు కొనుగోలు చేసి ఆ అమ్మాయిని బలవంతంగా, ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా భీంగల్ అలియాస్ సంపంగి లక్ష్మీ, ఆమెతో సహజీవనం చేస్తున్న సుంకరి శంకర్ వీరికి సహకరించిన కొత్త బస్టాండ్ వద్ద ఉన్న శ్రీనివాస లాడ్జి ఓనర్ నరసింహా రెడ్డిని జైలుకు పంపినట్లు తెలిపారు. పట్టణంలో వ్యభిచారం చేయించి డబ్బులను సంపాదిస్తున్న వారిపై ప్రత్యేక దృష్టిసారించి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని లాడ్జీల యజమానులకు, హోటల్‌ల వారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, అలాచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జల సంరక్షణ అందరి బాధ్యత

- జిల్లా భూగర్భ జలశాఖ అధికారి సతీష్

లింగంపేట, మార్చి 22: జల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా భూగర్భ జలశాఖ అధికారి సతీష్ అన్నారు. ఆయన శుక్రవారం లింగంపేట మండల కేంద్రంలోని పోతాయిపల్లిలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా ఉపాధి కూలీలకు భూగర్భ జలాల నిర్వహణ, నియంత్రణ, స్థిరమైన అభివృద్ధిపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షపు నీటిని వృథాగా పోకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, సూచించారు. అటవీ ప్రాంతాల్లో పర్కులేషన్ ట్యాంకులు, కాంటూరు కందకాలు, ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని ఆయన తెలిపారు. చెరువుల్లో పూడిక మట్టిని తీయడం ద్వారా చెరువులో నీటి సామర్థ్యం పెరుగుతుందని సూచించారు. భూగర్భ జాలాల ప్రాముఖ్యత, వాల్టా చట్టం, భూగర్భ జలాల సంరక్షణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు.

31న ఉచిత విద్య కోసం పరీక్ష

కామారెడ్డి టౌన్, మార్చి 22: జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదవబోయే విద్యార్థులకు ఉచిత విద్య కోసం ఈనెల 31న పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల యాజమాన్య సభ్యులు తెలిపారు. అందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలు ఉన్నత విలువలు కలిగినటువంటి విద్యాసంస్థలని విద్యార్థులను చేర్పించడం తల్లిదండ్రులకు చక్కటి అవకాశమని తెలిపారు. ఉచిత విద్య కోసం పరీక్షకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు బొడ్డు శంకర్, అశోక్‌రావు, ప్రతాప్‌గౌడ్, లాల్‌వరిందాని, ఎస్ఎస్ చారి, ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఆటోల ఏర్పాటు

దోమకొండ, మార్చి 22: మండలంలోని అంబార్‌పేట గ్రామానికి చెందిన పదో తరగతి పరీక్షలు రాసే 47 మంది విద్యార్థులకు గ్రామస్థుడు ఆరుట్ల అనిల్ తన సొంత ఖర్చులతో రవాణా సౌకర్యం ఏర్పాటు చేయించాడు. అంబార్‌పేట నుంచి బీబీపేట పరీక్షా కేంద్రానికి, తిరిగి అంబార్‌పేటకు పరీక్షలు పూర్తయ్యేంత వరకు ఆటోల సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.

యువతీ యువకులు ఓటు హక్కును పొందాలి

దోమకొండ, మార్చి 22: మండలంలోని 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సంజయ్‌రావ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటరు నమోదు ప్రక్రియ కార్యక్రమం నిర్వహించి అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 60 సంవత్సరాలు నిండి వృద్ధాప్యంలో ఉన్నవారు. వికాలాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వారు వారికి సంబంధించిన పత్రాలు సమర్పించాలన్నారు.

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

